సాక్షి ప్రకాశం

బుధవారం । 2 । ఆగస్టు । 2023



అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు
సెల్ టవర్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు.
- 8లో..



4న జాబ్‌మేళా
ఈనెల 4వ తేదీ సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
34/28

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది.
ఉక్కపోతగా ఉంటుంది.
గాలిలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

రైల్వే డీఎస్పీ ఎంఎన్ రాజును సన్మానించిన మంత్రి పెద్దిరెడ్డి



రైల్వే డీఎస్పీ ఎంఎన్.రాజును సన్మానిస్తున్న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఒంగోలు సబర్బన్: రైల్వే డీఎస్పీ ఎంఎన్ రాజును రాష్ట్ర విద్యుత్, గనులు, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం సన్మానించారు. జిల్లాకు చెందిన ఎంఎన్ రాజు రైల్వే ఆర్‌పీఎఫ్ నిర్వహించిన నియామకాల్లో నూతనంగా నేరుగా డీఎస్పీగా నియమితులయ్యారు. మొట్టమొదటి సారిగా రైల్వేలో స్పోర్ట్స్ కోటా ఆర్‌పీఎఫ్ డీఎస్పీగా ఎన్నికవడంతో మంత్రి కుటుంబంతో సన్నిహిత సంబంధాలున్న ఎంఎన్ రాజును తిరుపతిలోని మంత్రి నివాసంలో ప్రత్యేకంగా సన్మానించారు. ఎంఎన్ రాజును వెస్ట్రన్ రైల్వే ఇంటెలిజెన్స్ డీఎస్పీగా నియమించారు.

పరస్పర బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాల్లో పనిచేస్తున్న క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్లు (సీఆర్ఎంటీ), మండల్ లెవల్ అకౌంటెంట్స్, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్ల పరస్పర బదిలీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో వీఎస్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 4వ తేదీలోపు సంబంధిత దరఖాస్తును, సర్వీస్ సర్టిఫికెట్, స్పౌజ్ సర్టిఫికెట్ తదితర అవసరమైన పత్రాలను మండల విద్యాశాఖ అధికారులచే ధ్రువీకరింపజేసి స్వయంగా ఒంగోలు సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలన్నారు. సీనియార్టీ నిర్ధారణకుగాను మొట్టమొదటగా సర్వీసులో చేరిన తేదీని సంబంధిత మండల విద్యాశాఖ అధికారులచే ధ్రువీకరణ చేయించి సమర్పించాలన్నారు.

ధార్మికేతర కార్యక్రమాలకే అనుమతులు

ఒంగోలు: జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని క్రీడాప్రాంగణాలు, తరగతి గదులు, పాఠశాలలకు చెందిన ఇతర ఆస్తుల ఉపయోగం కోసం గ్రామస్తులు/పూర్వ విద్యార్థుల నుంచి దరఖాస్తులు వచ్చినట్లయితే అవి ధార్మికేతరమైనవి అయితే మాత్రమే అనుమతి కోసం జెడ్పీ కార్యాలయానికి పంపాలని జెడ్పీ సీఈవో బి.జాలిరెడ్డి హెచ్‌ఎంలను ఆదేశించారు. అనుమతులు కోరుతూ ప్రతిపాదనలు సమర్పించే సందర్భంలో అత్యంత జాగరూకతతో వ్యవహరించాల్సిందిగా హెడ్మాస్టర్లకు సూచించారు.

10 నుంచి డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పరీక్షలు

ఒంగోలు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ విద్యార్థులకు ఈనెల 10 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో వీఎస్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2015-17 మొదలు 2018-20 సంవత్సరం వరకు విద్యార్థులు గతంలో రెండో సంవత్సరం వార్షిక పరీక్షలు రాసి ఫెయిలైన విద్యార్థులకు ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. 2021-23 బ్యాచ్ విద్యార్థుల మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు

ఒంగోలు అర్బన్: ప్రతి ఒక్క ఓటరు ఆధార్‌తో ఓటును అనుసంధానం చేసుకోవాలని ఆ దిశగా రాజకీయ పార్టీలు కృషి చేయాలని ఆర్డీవో విశ్వేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఒంగోలు నియోజకవర్గంలో ఇప్పటికి 71 శాతం ఆధార్ అనుసంధానం పూర్తయిందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. దీనిలో ఒంగోలు తహశీల్దారు మురళి, ఎంపీడీవో గిరిజ, కొత్తపట్నం తహశీల్దారు రమణారావు, ఏపీపీ వెంకటేశ్వర్లు, ఎలక్షన్ డీటీ రఫీ, శ్రీదేవి, అలేఖ్య, వైఎస్సార్ సీపీ నుంచి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు స్వరూప్, రాజశేఖర్, సత్యం, రసూల్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గడప ముంగిటకే..

ఉదయం 8 గంటలకే రయ్..రయ్‌మని ప్రత్యేక సైరన్ వేసుకుంటూ రేషన్ సరుకులతో ఎండీయూ వాహనం ఇంటి ముంగిటకు వచ్చి ఆగుతుంది. బియ్యం ఇతర సరుకులు ఆ వీధిలోని లబ్ధిదారులకు మధ్యాహ్నం 12 గంటల వరకూ పంపిణీ చేస్తారు. అవసరమైతే ఇంకో గంట ఉండి భోజనాలకు వెళ్తారు. తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి లబ్ధిదారులను బట్టి రాత్రి ఏడు గంటల నుంచి 9 గంటల వరకూ పంపిణీ చేస్తారు. అలా ఒక ప్రాంతంలో పూర్తయితే మరో ప్రాంతానికి వెళతారు. ఎవరైనా లబ్ధిదారు ఊరువెళితే వచ్చిన తర్వాత వలంటీరును సంప్రదిస్తే వాహనం ఎక్కడ ఉందో సమాచారం ఇస్తారు. అక్కడకు వెళ్లి తీసుకోవచ్చు. వీటిన్నింటికంటే ముందు రేషన్ ఎప్పుడు పంపిణీ చేస్తారో తన పరిధిలోని ఇళ్లకు వలంటీరు మెసేజ్ పెడతారు. ఇలా పక్కాగా రేషన్ పంపిణీ జరుగుతోంది.

- పక్కాగా రేషన్ పంపిణీ
- ఎండీయూ వాహనాలతో ఇంటి వద్దకే సరుకులు
- నాణ్యమైన విటమిన్ డి-12 కలిగిన ఫ్లోరిఫైడ్ బియ్యం పంపిణీ
- జిల్లాలో నెలకు 93,946.32 టన్నుల బియ్యం సరఫరా
- బియ్యంపై రూ.39.35 ప్రభుత్వ రాయితీ
- రేషన్ పంపిణీపై పక్కా నిఘా
- పంపిణీ వ్యవస్థపైనా ఎల్లో మీడియా అక్కసు

రేషన్ షాపులు 1392	ఎంఎల్ఎస్ పాయింట్‌లు 10
ఎండీయూ వాహనాలు 385	కార్డుదారులు 6,66,957



ఎండీయూ వాహనంలో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న వాహనదారు (ఫైల్)

ఒంగోలు అర్బన్:

పేద, బడుగు, బలహీన వర్గాలకు పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రభుత్వం నాణ్యమైన రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తోంది. మధ్యస్థ సన్నరకం బియ్యాన్ని సార్టెక్స్ చేసి ఫ్లోరిఫైడ్ బియ్యంగా మార్చి అందిస్తోంది. దీనివలన బియ్యంలో విటమిన్-డి12, ఫోలిక్‌యాసిడ్, ఐరన్ వంటి పోషకాలు ప్రజలకు అందుతున్నాయి. బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు, నాణ్యమైన గోధుమ పిండి కూడా పంపిణీ చేస్తోంది. జిల్లాలో జాతీయ ఆహార భద్రత చట్టం, రాష్ట్ర రేషన్ కార్డులకు కలిపి నెలకు 93,946.32 టన్నుల బియ్యం పంపిణీ జరుగుతోంది. బియ్యం పంపిణీపై సుమారు రూ.39.35పై ప్రభుత్వం రాయితీ కల్పించి ప్రజలకు కేజీ రూ.1 కే అందజేస్తోంది. జిల్లాలో 10 ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి 1392 రేషన్ షాపులకు సరుకులు సరఫరా అవుతున్నాయి. రేషన్ షాపులకు చేరిన సరుకులు 385 ఎండీయూ వాహనాల ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఆ వాహనాల ద్వారా సరుకులు సక్రమంగా కేటాయించిన ప్రాంతాల వారీగా పంపిణీ జరిగేలా లాటిట్యూడ్, లాంగ్యూట్యూడ్ నిర్దేశించి రూట్ ప్లాన్ అమలు చేస్తున్నారు. దీని ద్వారా సరుకులు దారి తప్పకుండా పటిష్టమైన నిఘా ఉంటుంది. అంతేకాకుండా రేషన్ షాపునకు సరుకులు చేరిన సమయంలో ఒకసారి, నెల మధ్యలో మరోసారి, పంపిణీ ప్రక్రియ ముగిసిన తర్వాత మరోసారి గ్రామ రెవెన్యూ అధికారులతో తనిఖీలు చేస్తున్నారు. దీంతో అక్రమాలకు చెక్ పెట్టినట్లు అయింది. ఎండీయూ వాహనాల ద్వారా ప్రజా పంపిణీ జరిగే సమయంలో సైతం వీఆర్‌ఓలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది తనిఖీలు చేస్తున్నారు. పంపిణీలో వలంటీర్లు దగ్గర ఉండి ప్రజలకు సరుకులు అందేలా చూస్తున్నారు. లబ్ధిదారులు ఎక్కడైనా సరుకులు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రేషన్ కార్డుదారుడు ఒక వేళ ఊరి వెళితే వచ్చిన తర్వాత తీసుకునే వెసులుబాటు ఉంది. ఉద్యోగస్తులు సాయంత్రం వేళల్లో తీసుకునేలా రాత్రి 7 గంటల వరకూ సరఫరా ఉంటుందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. అత్యవసరాల్లో వాహన సిబ్బంది ఎక్కువ సమయం ఉండైనా సరుకులు అందిస్తున్నారని తెలిపారు. ఇలా పక్కాగా రేషన్ పంపిణీ జరుగుతుంటే ఎల్లో మీడియా అసత్య ప్రచారాలకు తెరతీసింది. ఎక్కడో ఒక్క చోట జరిగిన తప్పును మొత్తం వ్యవస్థకు ఆపాదించేలా కథనాలు వండివారుస్తోంది.

అక్రమాలపై ప్రత్యేక దృష్టి

ప్రజలకు పంపిణీచేసే రేషన్ సరుకుల అక్రమాలపై జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు దృష్టి సారించి ఉక్కుపాదం మోపారు. ప్రభుత్వం తలపెట్టిన విధంగా పేదలకు నాణ్యమైన బియ్యం, ఇతర సరుకులు సజావుగా అందేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేశారు. పక్కా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను ఏర్పాటు చేశారు. గడిచిన ఆరు నెలల్లో అక్రమాలకు పాల్పడిన 12 రేషన్ షాపులపై చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా 21 అక్రమ రవాణా, నిల్వ చేసిన పీడీఎస్ బియ్యం తరలింపులపై 6ఏ కేసులు నమోదు చేశారు. అంతేకాకుండా 7 రైస్ మిల్లులపై దాడులు నిర్వహించి 12 కేసులు నమోదు చేయడంతో పాటు 1943.46 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం మీద జిల్లాలో పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు చేసేలా చర్యలు షురూ అయ్యాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రోజుకు 3 రేషన్ షాపులు తప్పనిసరిగా తనిఖీలు చేసేలా జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల మొత్తంలో డీటీ పరిధిలోని అన్నీ రేషన్ షాపులు తప్పనిసరిగా తనిఖీ జరిగేలా పక్కా చర్యలు చేపట్టారు.

రేషన్ బియ్యం అక్రమాలను సహించం



ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే బియ్యంలో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు. నాణ్యమైన ఫ్లోరిఫైడ్ బియ్యం అందచేస్తూ ప్రజలకు మేలు చేసే కార్యక్రమంలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినా, అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఆ మేరకు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో పక్కా ప్రణాళికలతో చర్యలు తీసుకుంటున్నారు. పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా సివిల్ సప్లయిస్ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

పక్కాగా ఎన్‌ఫోర్స్‌మెంట్



ప్రభుత్వం సంకల్పించినట్లు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు రేషన్ బియ్యం (ఫ్లోరిఫైడ్), ఇతర సరుకులు సజావుగా అందేలా పక్కాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏర్పాటు చేసి నిఘా ఉంచాం. జిల్లాలో 385 ఎండీయూ వాహనాలతో కార్డుదారుల వద్దకే సరుకులు పంపిణీ చేస్తున్నాం. జిల్లాలో 85 నుంచి 90 శాతం వరకు ప్రతి నెలా రేషన్ పంపిణీ విజయవంతంగా జరుగుతోంది. రేషన్ బియ్యం, ఇతర సరుకుల్లో ఎవరు అక్రమాలకు పాల్పడినా ఉక్కుపాదం మోపుతాం. కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ రవాణా వాహనాలు, అక్రమాలకు పాల్పడిన మిల్లులు సీజ్ చేస్తాం.

– శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్

పంట కాలువనూ మింగేశారు

- పంట కాలువ పూడ్చివేసిన టీడీపీ నేత
- కాలువపై వెంచర్ ఏర్పాటు



మార్కాపురం-బోడపాడు కాలువ



కాలువ స్థానంలో పైప్‌లైను వేసిన దృశ్యం

మార్కాపురం: మార్కాపురంలో టీడీపీ నేతలు బరితెగించారు. తాము నిర్వహిస్తున్న రియల్ ఎస్టేట్ వెంచరులో పంట కాలువ అడ్డుగా ఉందని, దానిని మూసి వేసి ప్లాట్లు వేసి అమ్మకానికి సిద్ధం చేశారు. ఈ పంట కాలువ కింద సుమారు 150 ఎకరాల సాగు భూమి ఉంది. టీడీపీ నేతల ఆక్రమణలపై రైతులు మండిపడుతున్నారు. చరిత్ర ప్రసిద్ధిగాంచిన మార్కాపురం చెరువు కింద అధికారికంగా 2500 ఎకరాలు, అనధికారికంగా మరో 1500 ఎకరాలు సాగవుతోంది. మార్కాపురం నుంచి బోడపాడుకు వెళ్లే పంటకాలువ మొత్తం 5 కిలోమీటర్లు ఉంటుంది. ఈ కాలువ కింద అటు ఇటుగా 150 ఎకరాలు సాగులో ఉంది. నేషనల్ హైవే పక్కన మార్కాపురానికి చెందిన టీడీపీ రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్లాట్ల బిజినెస్ ప్రారంభించాడు. ఆయన ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ వెంచర్ల పొలంలో నుంచి మార్కాపురం-బోడపాడుకు వెళ్లే చెరువు కాలువ సుమారు మూడు అడుగుల వెడల్పులో వెళ్తోంది. అడ్డుగా ఉందని భావించిన సదరు టీడీపీ నేత కాలువను పూడ్చివేశాడు. చిన్న పైపులైను వేసి మమ అనిపించాడు. చుట్టూ కంచె వేసి భూమిని చదునుచేసి ప్లాట్లు పెట్టుకున్నాడు. మూడడుగుల వెడల్పులో ఉండాల్సిన కాలువ కుంచించుకుపోవడంతో మార్కాపురం చెరువుకు నీళ్లొస్తే ఈ కాలువ ద్వారా పొలాలకు ఎలా వెళ్తాయో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. సదరు టీడీపీ నేత తన పొలంలోనే రియల్ ఎస్టేట్ వెంచరును ఏర్పాటు చేసుకున్నా పంట కాలువను మాత్రం ధ్వంసం చేస్తూ వ్యాపారం చేయడంపై సర్వత్రా రైతుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ సీజన్‌లో వర్షాలు పడితే వివిధ పంటలు సాగుచేసేందుకు రైతులు సిద్ధమవుతున్న సమయంలో పంట కాలువను కలుపుకుని ధ్వంసం చేసి ఎవరికీ అనుమానం రాకుండా నామమాత్రంగా పైపులైను వేస్తే రేపు ఎలా పంటలను సాగుచేసుకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల నుంచి ఈ వెంచరులో పనులు జరుగుతున్నాయి. కాలువను బాగుచేసుకుందామన్నా లోపలికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సుమారు 100 నుంచి 200 మీటర్ల పొడవునా పంట కాలువ ధ్వంసమైనట్లు తెలుస్తోంది.

నోటీసులిచ్చి తొలగిస్తాం

మార్కాపురం-బోడపాడు పంట కాలువ ఆక్రమణపై ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసనాయక్‌ను వివరణ కోరగా తాను అక్కడికి వెళ్లి పరిశీలించి నిర్వాహకులకు నోటీసులిచ్చి పంట కాలువ ఎలా ఉంటే అలా ఉండేలా పునరుద్ధరిస్తామని తెలిపారు. కాలువ స్థానంలో పైపులు వేసిన విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లగా కాలువ పాత పద్ధతిలో ఉండేలా చూస్తానని చెప్పారు.

– శ్రీనివాసనాయక్, ఇరిగేషన్ ఏఈ, మార్కాపురం.

టీడీపీ శ్రేణుల బరితెగింపు



బైకులు అడ్డం పెట్టడంతో రోడ్డు మీదే బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



రోడ్డు మీద ఎమ్మెల్యేకి అడ్డం పెట్టిన స్కూటీ, బైకు

- ఎమ్మెల్యే టీజేఆర్ గడప గడపను అడ్డుకున్న టీడీపీ కార్యకర్తలు
- స్కూటీ, బైకును అడ్డం పెట్టి మా బజార్‌కు రావద్దని అడ్డగింత
- రోడ్డు మీదే బైటాయించి నిరసన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే టీజేఆర్

చీమకుర్తి: ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని పేర్నమిట్టలోని టీడీపీ నాయకులు మోటర్ సైకిళ్లు అడ్డుపెట్టి అటకాయించారు. మంగళవారం ఉదయం నుంచి పేర్నమిట్టలోని 41వ డివిజన్‌లో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రికి సుమారు 800 గడపలకు పైగా తిరిగి ప్రతి ఒక్కరి సమస్యలతోపాటు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకుంటున్నారు. రాత్రి 8-9 గంటల మధ్య మరో అరగంటలో కార్యక్రమం ముగుస్తుందనుకుంటున్న సమయంలో ఒక బజారులోకి ఎమ్మెల్యేని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు, అధికారులను రానీయకుండా ఒక స్కూటీ, ఒక బైకును రోడ్డుకు అడ్డంగా పెట్టారు. మా బజారుకు రావద్దని టీడీపీ నాయకులు గడప గడప కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, దుంపా యలమందారెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తేళ్ళ చంద్రశేఖర్, నూకతోటి ఈశ్వరరావు, కొమ్మూరి సుధాకర్‌రావు, తేళ్ల రాజారావు, దాసరి ఏడుకొండలు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రోడ్డుకు అడ్డంగా బైకులను ఎందుకు అడ్డం పెట్టారని అడిగేందుకు ప్రయత్నించగా స్థానిక టీడీపీ నాయకులు వారితో వాగ్వాదానికి దిగారు. ఇరువురి మధ్య తోపులాట జరిగింది. దానికి నిరసనగా ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అడ్డంగా పెట్టిన బైకుల వద్ద రోడ్డు మీదే కూర్చొని ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎలా అడ్డుకుంటారని ప్రశ్నిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి మీరు ఎవరంటూ ప్రశ్నించారు. చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు ఇక్కడి నుంచి కదిలేదే లేదని బైఠాయించారు. అంతలో ఒంగోలు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, తాలూకా ఎస్సైలు అంకమ్మరావు, మల్లికార్జునరావుతో పాటు పలువురు పోలీస్ కానిస్టేబుల్స్ బైకులు తీయించి పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు. ప్రభుత్వ కార్యక్రమాన్ని అడ్డుకున్నందుకు, దళిత ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ఆటంక పరచటమే కాకుండా వైఎస్సార్‌సీపీకి చెందిన దళిత నాయకులను కులం పేరుతో దూషించి చేతులతో దాడిచేసిన ఈదర విష్ణు, గోలి శ్రీనివాసరావు, మరో పది మంది టీడీపీ కార్యకర్తలపై కార్పొరేటర్లు తేళ్ల చంద్రశేఖర్, నూకతోటి ఈశ్వరరావు, కొమ్మూరి సుధాకర్‌రావు, తేళ్ల రాజారావు, దాసరి ఏడుకొండలు, బిక్షాలు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జగనన్న సురక్షతో ఇంటి వద్దకే సేవలు

- 99.52 శాతంతో రాష్ట్రంలో జిల్లా 6వ స్థానం
- 719 సచివాలయాల పరిధిలో ప్రత్యేక క్యాంప్‌ల్లో 4,61,521 అర్జీలు పరిష్కారం
- కలెక్టర్ దినేష్‌కుమార్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ కె.శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను జిల్లా వ్యాప్తంగా అందించామని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. మంగళవారం ప్రకాశం భవనంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమం వివరాలను విలేకరుల సమావేశంలో వివరించారు. 99.52 శాతం సేవలు ప్రజలకు అందించడంతో రాష్ట్రంలో మన జిల్లా 6వ స్థానంలో నిలిచిందని తెలిపారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు సచివాలయాల స్థాయిలో నిర్వహించామన్నారు. గత నెలలో మొత్తం 719 సచివాలయాల పరిధిలో ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో మొత్తం 4,63,919 విజ్ఞప్తులు వచ్చాయని, వాటిలో 4,61,521 అర్జీలను పరిష్కరించామన్నారు. ఇంటిగ్రేటెడ్, ఆదాయ సర్టిఫికెట్‌లు, ఆధార్‌తో మొబైల్ అనుసంధానం అప్‌డేట్, 1బీ, కంప్యూటరైజ్డ్ అడంగళ్, రేషన్‌కార్డులో కొత్తగా సభ్యుని చేర్పు, జనన, మరణ సర్టిఫికెట్‌లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, కొత్త రేషన్ కార్డు, సీసీఆర్‌సీ కార్డులకు సంబంధించిన సర్వీసుల కోసం అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఒంగోలు డివిజన్‌లో 1,84,204, మార్కాపురం డివిజన్‌లో 1,65,000, కనిగిరి డివిజన్‌లో 1,14,715 సర్వీసు విజ్ఞప్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు వారం రోజులు ముందుగానే ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, సేవలపై ఆరా తీసి ఇంకా ఏమైనా సేవలు అవసరముంటే గుర్తించారని చెప్పారు. ఆయా సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంపులు నిర్వహించి లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్‌లు, సర్వీసులు అందించామన్నారు. 7,70,325 గృహాల నుంచి విజ్ఞప్తులు రాగా వాటిలో 6,71,098 గృహాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించినట్లు తెలిపారు. కొన్ని ఇళ్లకు తాళాలు వేసి ఉండటం, పొరుగు ఊళ్లకు వెళ్లడంతో పూర్తి స్థాయిలో పరిష్కారం కాలేదన్నారు. వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియ గతంలో 25 శాతం ఉంటే సురక్ష పథకంతో దాన్ని 50 శాతానికి పెంచగలిగామన్నారు. త్వరలో నూరు శాతం పూర్తి చేసేలా సచివాలయాల పరిధిలో చర్యలు తీసుకుంటామని వివరించారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో గతంలో ఉన్న స్ప్లిట్టింగ్ సమస్య కూడా పరిష్కారం అయినట్లు తెలిపారు. జిల్లాలో 93 శాతం ఇళ్లకు ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా ప్రయోజనం కలుగుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి కోసం మరో 45,443 దరఖాస్తులు వచ్చాయని, వాటిని ఆగస్టు 15వ తేదీలోపు పరిశీలించి అర్హత ఉన్న వారికి ప్రయోజనం కల్పిస్తామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు.

తాగునీటి అవసరాలకే సాగర్ జలాలు:

జిల్లాలో తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. కనీసం అక్టోబర్ వరకు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. యర్రగొండపాలెం, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల్లో సీపీడబ్ల్యూ పథకాలకు సాగర్ నీటిని మళ్లించామని చెప్పారు. సాగర్ నుంచి వచ్చిన నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించనున్నట్లు తెలిపారు. వర్షాధార పంటలను సాగు చేసేలా ఆర్బీకేల స్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

జిల్లా వైద్యశాలకు జాతీయ ముస్కాన్ అవార్డు

మార్కాపురం: మార్కాపురం జిల్లా వైద్యశాల జాతీయ ముస్కాన్ అవార్డుకు ఎంపికైనట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ సుబ్బారెడ్డి మంగళవారం తెలిపారు. జిల్లా వైద్యశాలలోని చిన్నపిల్లల, పురిటి పిల్లల వైద్య చికిత్స, వార్డుల్లో సౌకర్యాలపై జూన్ 19, 20 తేదీల్లో సెంట్రల్ టీమ్ సభ్యులైన డాక్టర్ అరవింద్, ప్రదీప్ శ్రీవాస్తవ్‌లు పరిశీలించారు. చిన్నపిల్లల విభాగాలకు చెందిన వార్డుల్లో తిరిగి పిల్లలకు అందుతున్న వైద్య సహాయం గురించి తల్లిదండ్రులను విచారించారు. సీజనల్ వ్యాధులపై చిన్నపిల్లల తల్లిదండ్రులకు ఇక్కడి డాక్టర్లు ఎలా అవగాహన కల్పిస్తున్నారో వివరాలు తెలుసుకున్నారు. ఈ నివేదికను కేంద్ర కుటుంబ ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులకు సమర్పించారు. ఈ నేపథ్యంలో మార్కాపురం జిల్లా వైద్యశాలకు చిన్నపిల్లల విభాగ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ముస్కాన్ అవార్డుకు ఎంపిక చేసినట్లు సుబ్బారెడ్డి తెలిపారు. వైద్యశాలలో సిబ్బంది పేషెంట్లకు అందిస్తున్న సేవలపై 91 పాయింట్లు వచ్చినట్లు చెప్పారు. త్వరలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి అవార్డు అందుకోనున్నారు. మంగళవారం సర్టిఫికేషన్ జిల్లా వైద్యశాలకు వచ్చినట్లు ఆయన తెలిపారు.

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

- జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి

ఒంగోలు అర్బన్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం పలువురు జిల్లా అధికారులతో కలిసి ప్రకాశం భవనం నుంచి పలు అంశాలపై మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో డీపీవో మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ శీనారెడ్డి, సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ ఉషారాణి హౌసింగ్ పీడీ పేరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, సీపీవో వెంకటేశ్వర్లు, టీబీ నివారణ అధికారి సురేష్‌కుమార్, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ముందుగా జాయింట్ కలెక్టర్ భూ సేకరణ, రెవెన్యూ అంశాలపై అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు.

క్లుప్తంగా

రెజ్లింగ్‌లో ఉప్పలపాడు విద్యార్థి సత్తా


చరణ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఎంసీ చైర్మన్

కొండపి: గ్రాప్లింగ్ రెజ్లింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో కొండపి మండలం కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన పాడిబండ్ల చరణ్ సత్తా చాటాడు. అనకాపల్లిలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జూలై 29, 30వ తేదీల్లో నిర్వహించిన గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో విజయం సాధించిన చరణ్‌ను స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం ప్రసన్నకుమార్, పీఎంసీ చైర్మన్ రాఘవశర్మ, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

కనిగిరి రూరల్: ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం కనిగిరిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. కనిగిరి పట్టణంలోని 9వ వార్డులో ముగ్గు బావి వీధిలో నివసించే ఎస్‌కే ఉస్మాన్(40) గత కొంత కాలంగా ఆర్థిక, కుటుంబ సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాను హుక్కుకు చీరతో ఉరేసుకుని మృతి చెందాడు. తండ్రి ఖాదర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీటీసీకి గాయాలు


ప్రమాదానికి గురైన కారు

కొమరోలు: రోడ్డు ప్రమాదంలో తాటిచెర్ల ఎంపీటీసీ సభ్యుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొమరోలు మండలంలోని యర్రంశెట్టివానిపల్లె క్రాస్ రోడ్డు వద్ద అమరావతి–కడప హైవేపై చోటుచేసుకుంది. తాటిచెర్ల ఎంపీటీసీ కామూరి శ్రీనివాసులరెడ్డి మంగళవారం తెల్లవారుజామున గుంటూరు నుంచి కొమరోలుకు కారులో వస్తున్నారు. ఈ క్రమంలో యర్రంశెట్టివానిపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. గాయపడిన ఎంపీటీసీ సభ్యుడిని కొమరోలులో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరు వైద్యశాలకు తరలించారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

- సెల్ టవర్ల రిమోట్ రేడియో యూనిట్లు, బేస్ బ్యాండ్లే వీరి లక్ష్యం
- మదనపల్లిలో విక్రయించేందుకు వెళ్తుండగా అదుపులోకి..
- స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.16 లక్షలు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మలికా గర్గ్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మలికగర్గ్

ఒంగోలు సిటీ: చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటుపడి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సెల్ టవర్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. సెల్ టవర్లలో వినియోగించే రిమోట్ రేడియో యూనిట్లు, బేస్ బ్యాండ్లను తస్కరించి హైదరాబాద్, చిత్తూరు జిల్లా మదనపల్లిలో విక్రయించి సొమ్ము చేసుకున్న నలుగురిని అరెస్టు చేశామని ఎస్పీ మలికా గర్గ్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది మే 13వ తేదీ రాత్రి పామూరులోని కందుకూరు రోడ్డులో ఎయిర్‌టెల్ సెల్ టవర్ పనిచేయడం లేదని సూపర్‌వైజర్ శ్రీనివాసరావు గుర్తించారు. ఈ విషయాన్ని ఒంగోలులో సెక్యూరిటీ ఆఫీసర్ అంజయ్యకు తెలియజేశారు. మరుసటి రోజు ఎయిర్‌టెల్ బృందం సభ్యులు పామూరు వెళ్లి సెల్‌టవర్‌ను పరిశీలించారు. సెల్ టవర్‌కు 30 అడుగులు ఎత్తులో బిగించిన రిమోట్ రేడియో యూనిట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించారు. వెంటనే పామూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఎస్పీ మలికా గర్గ్ సీరియస్‌గా తీసుకున్నారు. క్రైమ్ అడిషనల్ ఎస్పీ శ్రీధర్ నేతృత్వంలో కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజు, పామూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్సై సురేష్‌తో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించారు. కేసు దర్యాప్తులో భాగంగా జూలై 31న సాయంత్రం పామూరు–కందుకూరు జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో ఉన్న నలుగురు వ్యక్తులు పోలీస్ వాహనాన్ని చూసి పారిపోయేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఎయిర్‌టెల్ మేనేజరుగా పనిచేస్తున్న దుగ్గిపోగు నవీన్‌కుమార్(28), బేస్తవారిపేట మండలం పూసలపాడు గ్రామానికి చెందిన మోతుకూరి సునీల్(25), మోతుకూరి విజయకుమార్(27), పెద్దారువీడుకు చెందిన కువ్వారపు తిరపతయ్య(23)ను విచారించగా సెల్ టవర్ల రిమోట్ రేడియో యూనిట్, బేస్ బ్యాండ్లను దొంగిలించి మదనపల్లి, హైదరాబాద్‌లో విక్రయించినట్లు అంగీకరించారు. అలా వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. పామూరు, వినుకొండ, గాజులపల్లి, మార్కాపురం టౌన్, కొమరోలు తదితర ప్రాంతాల్లోని టవర్లలో దొంగిలించిన 5 రిమోట్ రేడియో యూనిట్లు, 2 బేస్ బ్యాండ్లను మదనపల్లిలో ఒక వ్యాపారికి విక్రయించేందుకు కారులో తీసుకెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చేసిన సొత్తు విలువ సుమారు రూ.16 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన క్రైమ్ అడిషనల్ ఎస్పీ శ్రీధర్, కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజు, పామూరు సీఐ శ్రీనివాసరావు, పామూరు ఎస్సై కె.సురేష్, సిబ్బందిని ఎస్పీ మలికాగర్గ్ అభినందించారు.


దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న సామగ్రి

మెడికోల వివాదంపై విచారణ

- తాత్కాలికంగా 9 మంది విద్యార్థులు ఇంటికి..
- విచారణ అనంతరం వారిపై తగిన చర్యలు
- మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్

ఒంగోలు అర్బన్: స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థుల మధ్య మెస్ కాంట్రాక్టు విషయంలో కొంత ఘర్షణ వాతావరణం ఏర్పడిందని కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు తెలిపారు. ఈ వివాదానికి సంబంధించి 9 మంది విద్యార్థులను తాత్కాలికంగా ఇంటికి పంపామని మంగళవారం పేర్కొన్నారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా వైద్య విద్యార్థులు చదువుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలేజీ అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు.

ఇబ్బంది పెడుతున్న విద్యార్థులను సస్పెండ్ చేయాల్సిందే..

స్టూడెంట్ మెస్ కాంట్రాక్టు అంశంతోపాటు కొద్ది మంది విద్యార్థుల ఆగడాలపై ప్రభుత్వ మెడికల్ కాలేజీలో గత రెండు రోజులుగా ఘర్షణ వాతావరణం నెలకొంది. గొడవలు సృష్టిస్తున్న విద్యార్థులను సస్పెండ్ చేయాలని మిగిలిన విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. 2020 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు చెడు వ్యసనాలకు బానిసలై తమను నానా ఇబ్బందులు పెడుతున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఆ మేరకు కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబుకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. గొడవలు సృష్టించే విద్యార్థులను గతంలో కూడా సస్పెండ్ చేశారని, మరలా కాలేజీకి వచ్చి అడ్డగోలుగా వ్యవహరిస్తూ, దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ వివాదంపై జీజీహెచ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ, కాలేజీ హెచ్‌ఓడీలు, విద్యార్థులతో ప్రిన్సిపాల్ చర్చలు జరిపి పూర్తి స్థాయి విచారణ చేపట్టారు.

విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ఎటువంటి గొడవలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులను ఇంటికి పంపినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు.

4న సింగరాయకొండలో జాబ్ మేళా

- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి
- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్/సింగరాయకొండ: ఈ నెల 4వ తేదీన సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ప్రకాశం భవనంలో జేసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండపి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన శాఖ, సీడాప్ సంయుక్తంగా కొండపి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్ బాబు సహకారంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో 15 కంపెనీలు పాల్గొని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. వివరాలకు 80089 86256, 81252 15216ను సంప్రదించాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, బాషా, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.


జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ శ్రీనివాసులు

బీసీలంటేనే భయంతోనే
గ్లామర్ రాజకీయాలు

- దమ్ము, ధైర్యం ఉంటే మీ హయాంలో బీసీలకు ఏం చేశావో చెప్పండి
- బీసీలకు వంద సీట్లు అంటూ ఎన్నాళ్లు మోసం చేస్తారు
- మూడు రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను కాపీకొట్టి మేనిఫెస్టో అనడానికి సిగ్గుండాలి
- టీడీపీ నాయకత్వంపై నిప్పులుచెరిగిన ఎమ్మెల్సీ పోతుల సునీత



ఒంగోలు: బీసీలంటే భయం కాబట్టే మరో మారు బీసీలను మోసం చేయాలనే తలంపుతో గ్లామర్ రాజకీయాలకు తెరలేపావని నారా లోకేష్‌పై ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒంగోలులో ప్రకటించిన బీసీల గర్జన సదస్సుకు బీసీలు రారని అర్థమై యాంకర్లను తీసుకొచ్చి గ్లామర్ రాజకీయాలకు తెరలేపారన్నారు. బీసీలకు తన అయిదేళ్ల పాలనలో చంద్రబాబు మొండి చేయిచూపబట్టే ఈ పరిస్థితి అన్నారు. బీసీలకు వందసీట్లు ఇస్తానని చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి ఎన్ని సీట్లు ఇచ్చారో గమనించాలన్నారు. రూ.50 వేల కోట్లు బీసీలకు ఖర్చు చేయాల్సి ఉంటే కనీసం రూ.10 వేల కోట్లు కూడా ఖర్చుచేయని సీఎం చంద్రబాబు అన్నారు. బీసీలు జడ్జీలుగా పనికిరారంటూ కేంద్రానికి లేఖ రాసిన ఆయనకు బీసీల సంక్షేమం, అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదని అన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్ తన పాలనలో ఐదుగురు బీసీలను రాజ్యసభకు పంపారని, 13 మేయర్ పదవులు ఉంటే 7 పదవులు, 13 జెడ్పీ చైర్మన్ పదవులు ఉంటే 9 పదవులు, 11 మందికి మంత్రులుగా, 31 మంది ఎంఎల్‌ఏలు, 21 మంది బీసీలకు ఎంఎల్‌సీలుగా ఇచ్చి చరిత్ర సృష్టించారన్నారు. బీసీలంటే చులకన భావంతో తోకలు కత్తిరిస్తా అంటూ మత్స్యకారులు, నాయీబ్రాహ్మణులపై మండిపడిన చంద్రబాబును మరో మారు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. డ్వాక్రా మహిళల రూ.12 వేల కోట్ల రుణాలను రద్దుచేస్తానని ప్రకటించి మోసం చేసిన చరిత్ర చంద్రబాబుదైతే, రూ.25 వేల కోట్ల బకాయిలను నాలుగు విడతలుగా చెల్లించిన ఘనత జగనన్న ప్రభుత్వానిది అన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రకటించిన మ్యానిఫెస్టోను సైతం టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగించి నేడు మరలా సొంతంగా మ్యానిఫెస్టో రూపొందించుకునే సత్తాలేక కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వ పథకాలను కాపీ కొట్టి మ్యానిఫెస్టో అంటూ ప్రకటించడం మీ చిత్తశుద్ధిని స్పష్టం చేస్తోందన్నారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం రూ.2.25 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లో జమచేస్తే అందులో లక్షకోట్లు బీసీల ఖాతాల్లో జమచేశారన్నారు. గూగుల్‌లో లోకేష్ అని సెర్చిచేస్తే మందు, చిందుల ఫొటోలు కనిపిస్తాయని, వాటిని తనకు పంపుతానంటూ లోకేష్ మాట్లాడిన తీరు అతని సంస్కారానికి నిదర్శనం అని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్‌లు రాష్ట్రానికి పట్టిన సైతానులని విమర్శించారు. ఇప్పటికైనా లోకేష్ స్విమ్మింగ్ పూల్ రాజకీయాలు, అబద్ధపు మాటలు మానుకోవాలని, దమ్ము ధైర్యం ఉంటే టీడీపీ గత ఐదేళ్ల పాలనలో బీసీలకు ఏంచేశారో శ్వేతపత్రం విడుదలచేయాలని డిమాండ్ చేశారు.

చిత్తశుద్ధి, కఠోర దీక్షతో విజయం సొంతం

ఒంగోలు: చిత్తశుద్ధి, కఠోర దీక్ష ఉంటే విజయం మీకు బానిసేనని విద్యార్థులకు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ మారెడ్డి అంజిరెడ్డి ఉద్బోధించారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో జాతీయ నూతన విద్యావిధానం –2020పై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్యం నిర్దేశించుకోవడం, దానిని సాధించుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవడం, వాటిని పాటించడం ద్వారా విజయాన్ని బానిసగా చేసుకోవచ్చన్నారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన తాను వైస్ చాన్స్‌లర్ అయ్యానంటే అందుకు కారణం పక్కా ప్రణాళిక ఉండబట్టేనన్నారు. నేడు జాతీయ విద్యా విధానం ద్వారా ప్రపంచంలో ఎక్కడైనా మెరుగైన ఫలితాలు పొందేందుకు అవకాశం ఏర్పడుతుందని, కనుక విద్యార్థులు ఆ దిశగా తమ ప్రయత్నాలను ప్రారంభించాలని సూచించారు. సుపరిపాలన వేదిక అధ్యక్షుడు మాగులూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలం నాటి మెకాలే విధానాలకు బదులుగా నేటి తరం విద్యార్థులకు అవసరమైన సాంకేతిక విలువలతో కూడిన విద్య జాతీయ నూతన విద్యా విధానంతో అందుబాటులోకి వచ్చిందన్నారు. స్టార్టప్ సంస్థలు స్థాపించి సీఈవోలుగా రూపాంతరం చెందాలని ఆకాంక్షించారు. సదస్సులో కేంద్రీయ విద్యాలయం పాండిచ్చేరి ప్రొఫెసర్ ఆంజనేయమాస్టారు, జెడ్పీ విద్యాశాఖ అధికారి సామా సుబ్బారావు, సుపరిపాలన వేదిక ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్బారావు, టి.గోపాల్‌రెడ్డి, సీవీఎల్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని ప్రసంగించారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుపరిపాలన వేదిక అధ్యక్షుడు నాగేశ్వరరావు

సంక్షేమంలో రాజకీయాలకు తావులేదు


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

- సమస్యల పరిష్కారానికే గడప గడపకూ వస్తున్నా..
- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం రూరల్: రాజకీయాలతో సంబంధం లేకుండా కుల, మత వర్గాలనే భేదం చూపకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాలు పథకాలను అందిస్తున్నామని, అదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకత అని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం మండలంలోని గోగులదిన్నె గ్రామంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజలు చెప్పిన పలు సమస్యలను ఎమ్మెల్యే ఓపికగా విని నోట్ చేసుకుని, సంబంధిత శాఖాధికారులతో అక్కడికక్కడే మాట్లాడారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ కూకట్లపల్లి పెద్ద శ్రీను, గ్రామ పార్టీ అధ్యక్షుడు పగడాల కొండారెడ్డి, పగడాల లక్ష్మీరెడ్డి, కందుల శ్రీనివాసరెడ్డి, ఏసుబాబు, వెంకటయ్య, సిద్ధియాల సుబ్బారెడ్డి, గంటా చిన్నఅల్లూరిరెడ్డి, కొలగొట్ల శివారెడ్డి, ఉంజల శేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పొలాల్లో మతిస్థిమితం లేని వ్యక్తి మృతి


పొలాల్లో రత్నారెడ్డి మృతదేహం

దర్శి: దర్శి నగరపంచాయతీ పరిధిలోని చింతలపాలెం–తూర్పు వీరాయపాలెం మధ్య పొలాల్లో ముండ్లమూరు మండలం పులిపాడు గ్రామానికి చెందిన మడతల రత్నారెడ్డి(53) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. గేదెలను మేత కోసం పొలాలకు తీసుకెళ్లిన వ్యక్తులకు ఓ శవం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే వెళ్లి పరిశీలించి ఆ మృతదేహం రత్నారెడ్డిదిగా గుర్తించారు. రత్నారెడ్డి మతిస్థిమితం లేక కొద్ది రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం గాలిస్తూ.. వాల్‌పోస్టర్లు కూడా వేయించారు. ముండ్లమూరు పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రత్నారెడ్డి పొలాల్లో శవమై కనిపించాడు. మృతదేహం పక్కన పురుగు మందు ఖాళీ డబ్బాలు పడి ఉన్నాయి. మతిస్థిమితం లేక అక్కడి నీరు తాగి మృతి చెంది ఉంటాడని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు దర్శి పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు మృతి

- 9 సార్లు జాతీయ స్థాయిలో సత్తా చాటిన హర్షవర్ధన్‌రెడ్డి


హర్షవర్ధన్‌రెడ్డి(ఫైల్)

జే.పంగులూరు: బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలం కోటపాడు గ్రామానికి చెందిన జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు ఆవుల హర్షవర్ధన్ రెడ్డి(23) అనారోగ్య కారణాలతో సోమవారం రాత్రి మృతి చెందాడు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన హర్షవర్ధన్‌రెడ్డికి చిన్నతనం నుంచి హ్యాండ్‌బాల్‌పై ఆసక్తి. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో హ్యాండ్‌బాల్‌లో మంచి శిక్షణ పొందాడు. ఇప్పటి వరకు రెండుసార్లు ఆంధ్ర హ్యాండ్‌బాల్ జట్టు కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించాడు. 9 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు. ప్రస్తుతం అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ శిక్షణకు ఆంధ్ర జట్టు నుంచి ఎంపికయ్యాడు. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హర్షవర్ధన్‌రెడ్డి 15 రోజుల క్రితం పరీక్షలు రాసి ఇంటికి వచ్చాడు. మూడు రోజుల క్రితం శరీరం వణకడం మొదలైంది. స్థానిక ఆర్‌ఎంపీకి చూపించి, అక్కడ నుంచి మేదరమెట్ల వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ నుంచి ఒంగోలు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మరణించాడు. రక్త పరీక్షలు చేసినా వ్యాధి నిర్ధారణ కాలేదని వైద్యులు తెలిపారు. మూడు నెలల క్రితం గ్రామంలో హర్షవర్ధన్ కుక్కకాటుకు గురయ్యాడు. అప్పుడు ఇంజక్షన్ చేసుకుని కళాశాలకు వెళ్లాడు. తదుపరి కుక్క కాటుకు సంబంధించి ఎలాంటి చికిత్స తీసుకోలేదు. దీంతో రేబిస్ వైరస్ వల్ల చనిపోయి ఉంటాడని వైద్యులు అనుమానిస్తున్నారు.

ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- సంఘ జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు

ఒంగోలు సబర్బన్: ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘ జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ఎన్‌జీఓ హోంలో మంగళవారం రాష్ట్ర మహాసభల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ.. ఈ నెల 21, 22వ తేదీల్లో విజయవాడలోని పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథులుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పలువురు మంత్రులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి అసోసియేషన్ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్టారెడ్డి, ఇతర నాయకులు ఎం.మోహన్‌రావు, కె.శివకుమార్, కె.మంజేష్, షేక్ మగ్గం షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శరత్‌బాబు